సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం, 19, జనవరి, 2024



హోరాహోరీగా ఐఎస్ఎల్

ఉట్నూర్‌లో ఐఎస్ఎల్ పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హైజంప్, లాంగ్‌జంప్, పరుగు, డిస్క్‌త్రో పోటీలు నిర్వహించారు. 8లో▸



హైవేపై బోర్‌వెల్ లారీ బోల్తా

గుడిహత్నూర్ మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది వద్ద బోర్‌వెల్ లారీని ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/18.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి ప్రభావం కొనసాగనుంది. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

తగ్గిన పత్తి ధర

ఆదిలాబాద్‌టౌన్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ (సీసీఐ) ద్వారా ఇదివరకు క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.7,020 పలకగా ఈనెల 22నుంచి రూ.6,970తో కొనుగోలు చేయనున్నట్లు ఏఎంసీ కార్యదర్శి మధుకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పత్తి పొడవు, నాణ్యత రావడం లేదని సీసీఐ సంస్థ, భారత ప్రభుత్వ వస్త్ర పరిశ్రమ సూచించినట్లు పేర్కొన్నారు. స్టేబుల్ లెన్త్ 29.01–29 49 ఎంఎం, మైక్రోనేర్ 3.5–4.3 నాణ్యత ప్రమాణాల కింద ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్: బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో సీసీఐ పత్తి ధర తగ్గించింది. ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.7,020 ఉండగా, గురువారం నుంచి రూ.6,920కి తగ్గింది. బోథ్, పొచ్చెర, సొనాల, నేరడిగొండలోని సీసీఐ కేంద్రాల్లో రూ. 6,920తో పత్తి కొనుగోలు చేశారు. పత్తి గింజ పరిమాణం తక్కువగా వస్తోందని, మెక్‌మోడ్‌లో ఉండటంతో సీసీఐ అధికారులు ధర తగ్గించారని మార్కెట్ కార్యదర్శి దేవన్న తెలిపారు.

ఉద్యాన నర్సరీ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న వికాస్ మహతో

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీని గురువారం ఐటీడీఏ ప్రత్యేకాధికారి, ఆదిలాబాద్ శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. మామిడి, జామ, సపోట మొక్కలు పరిశీలించారు. ప్రయోగాత్మకంగా సాగు చేసిన బంతి, మునగ, పసుపు, కూరగాయల సాగు, ఉట్నూర్, బెల్లంపల్లి, జంబుగ, భీమారం నర్సరీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, డ్రిప్, విధానాలు, ఉపయోగాల గురించి అధికారులకు వివరించారు. ఆయన వెంట పీహెచ్‌వో సందీప్‌కుమార్, సాంకేతిక సహాయకురాలు కుమారి అర్షిత, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ వర్క్‌షాప్‌నకు జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



వర్క్‌షాప్ వద్ద జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో ఆరోగ్యకరమైన గ్రామంపై నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్‌లో ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి మురేస్వర్ పాటిల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ముత్యాల నాయుడు హాజరయ్యారు. జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొనే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ తెలిపారు.

బైపాస్ రద్దుకు రిలే దీక్ష

బేల: బేల బైపాస్ రద్దు చేయాలని మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం డోప్టాల, షాంషాబాద్, బేల, మోహబత్‌పూర్, బురాన్‌పూర్ రెవెన్యూ గ్రామాల శివారు బాధిత రైతులు రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఎంపీపీ వనిత గంభీర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు తన్వీర్ ఖాన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, నాయకులు మహేందర్, రాకేశ్ ఉన్నారు.



నాగోబా ప్రతిమ



కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం (ఫైల్)

నాగోబాకు రూ.20లక్షలు

- జాతర నిర్వహణకు నిధుల కేటాయింపు
- కాంగ్రెస్ సర్కార్ హయాంలో తొలిసారి..
- వచ్చేనెల 9నుంచి మహాపూజతో షురూ..
- ఐటీడీఏ ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ

సాక్షి, ఆదిలాబాద్: నాగోబా జాతర నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. మహాజాతర నిర్వహణకు రూ.20లక్షల నిధులు కేటాయించింది. నాగోబా కొలువుదీరిన ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో జాతర నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పనులు ప్రారంభించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఈ మహాజాతర నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. నిధుల కేటాయింపుతో పాటు ఏర్పాట్లు ఘనంగా చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

వచ్చే నెల 9నుంచి..

ఫిబ్రవరి 9న నాగోబా మహాపూజతో జాతర ప్రారంభించనున్నారు. ఆదివాసీల్లోని మెస్రం వంశీయుల ఇలవేల్పు నాగోబా. ఏటా మహాజాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధికసంఖ్యలో ఆదివాసీలు తరలివస్తారు. జాతర జరిగే రోజుల్లో పలు మెస్రం కుటుంబీకులు నాగోబా ఆలయ పరిసరాల్లో కుటీరాలు ఏర్పాటు చేసుకుని బస చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాట్లలో ఎక్కడా లోపం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈనెల 14వ తేదీన నెలవంక కనిపించడంతో దీనికి సంబంధించిన ప్రక్రియను మెస్రం వంశీయులు మొదలుపెట్టారు. ఆరోజు నుంచి మహాపూజల నిర్వహణపై ప్రచారం చేసేందుకు మెస్రం వంశీయులున్న గ్రామాలను చుట్టి వస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఆ తర్వాత కేస్లాపూర్ నుంచి జన్నారంలోని గోదావరి హస్తినమడుగు నుంచి పవిత్ర గంగాజలాలను సేకరించేందుకు పాదయాత్ర నిర్వహిస్తారు. నాగోబా జాతరకు మూడు రోజుల ముందు తిరిగి కేస్లాపూర్ చేరుకుంటారు. ఈ పవిత్ర గంగాజలంతో అభిషేకం చేస్తారు. ఈ నేపథ్యంలో మహాజాతరకు ముందు జరిగే పాదయాత్రకు కూడా ప్రాధాన్యం ఉంది.

ఐటీడీఏ ఆధ్వర్యంలో పర్యవేక్షణ..

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కేస్లాపూర్‌లో నాగోబా మహాజాతరకు సంబంధించి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పీవో చాహత్ బాజ్‌పాయ్ పర్యవేక్షణలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రధానంగా భక్తుల కోసం తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నారు. శాశ్వత మరుగుదొడ్లు, స్నానపు గదులున్నా జాతర సమయంలో వచ్చే భక్తులకు సరిపోవు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా మరిన్ని ఏర్పాటు చేస్తున్నారు. కేస్లాపూర్ ముఖద్వారం నుంచి నాగోబా ఆలయానికి వచ్చే దారిలో రోడ్ల మరమ్మతు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. జాతర సమయంలో పర్యవేక్షణలో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు భోజనాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా జాతర జరిగే సమయంలో పారిశుధ్య నిర్వహణ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటినుంచే జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణలో పారిశుధ్య నిర్వహణ పనులు ప్రారంభించారు.

పనులు ప్రారంభించాం



నాగోబా జాతర కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీటితో జాతర కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పనులు ప్రారంభించాం. జాతర నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం. ఎక్కడ లోటుపాట్లు రాకుండా చర్యలు చేపడుతున్నాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– చాహత్ బాజ్‌పాయ్, ఐటీడీఏ పీవో, ఉట్నూర్

పని చేస్తేనే కూలి

- ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు చెక్
- ఇక ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్
- ఎన్ఎంఎంఎస్ యాప్ రూపకల్పన
- వచ్చే ఏడాదినుంచి అమలయ్యే చాన్స్

కైలాస్‌నగర్: ఉపాధిహామీ పథకం పనుల్లో అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు అమలు చేస్తోంది. ఇప్పటికే పని ప్రదేశంలో కూలీల ఫొటోలతో కూడిన అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తోంది. తాజాగా బోగస్ కూలీలకు పూర్తిగా చెక్‌పెట్టేలా కూలీల ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానం అమలుకు యోచిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) యాప్‌ను రూపొందించింది. దీని పనితీరును క్షేత్రస్థాయిలో అధికారులు ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. అది విజయవంతమైతే వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) నుంచి పూర్తిస్థాయిలో దీన్ని వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

ఫొటో మ్యాచ్ అయితేనే కూలి

ఆదిలాబాద్ జిల్లాలో లక్షా 70వేల జాబ్‌కార్డులుండగా లక్షా 23వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వారందరి వివరాలు ఆధార్ కార్డులతో అనుసంధానం చేశారు. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది. నూతన విధానంలో ఆధార్ సర్వర్‌తో అనుసంధానమై ఉన్న ఎన్ఎంఎంఎస్ ప్రత్యేక యాప్‌లో కూలీల ముఖాలు ఫొటో తీస్తారు. ఈ ఫొటో ఆధార్‌లో అంతకుముందు దిగిన ఫొటోతో జత కలిస్తేనే కూలీలకు హాజరు పడుతుంది. తమ పరిధిలో పనిచేసే కూలీల వివరాలు ఫీల్డ్ అసిస్టెంట్లు ఆ యాప్‌లో ముందుగానే నమోదు చేసుకుని సిద్ధంగా ఉంటారు. అయితే ఈ విధానం బాగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న విధానంలో ఒక్కో కూలీ అటెండెన్స్ నమోదు చేసేందుకు 7నుంచి 8 నిమిషాల సమయం పడుతుందని చెబుతున్నారు. అలాగే జిల్లాలోని పలు గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య కూడా ఇందుకు అవరోధంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు.



అక్రమాలకు అడ్డుకట్ట

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు పని కల్పించాలనే సదుద్దేశంతో చేపట్టిన ఉపాధిహామీ పథకాన్ని కొంతమంది అక్రమాలమయంగా మార్చారు. పలు చోట్ల ప్రజాప్రతినిధులు, పలుకుబడి కలిగిన వ్యక్తుల కుటుంబీకులు పనులకు వెళ్లకున్నా హాజరైనట్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లు వారి అటెండెన్స్ వేసుకుని నిధులు స్వాహా చేశారు. గ్రామాల్లో నిర్వహించిన అనేక సామాజిక తనిఖీల్లో ఈ విషయం స్పష్టం కాగా, లక్షలాది రూపాయలు పక్కదారి పట్టినట్లు వెల్లడైంది. తాజాగా అమలు చేయనున్న నూతన విధానంతో ఇలాంటి వాటికి పూర్తిస్థాయిలో చెక్‌పడటంతోపాటు పనులకు హాజరైన కూలీలకే ప్రయోజనం కలగనుంది. ఉపాధిహామీ పనుల్లోనూ పారదర్శకత పెరుగుతుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ విధానం అమల్లోకి రానున్నట్లు చెబుతున్నారు.

ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నాం

ఉపాధిహామీలో పారదర్శకతను పెంచాలనే ఉద్దేశంతో కేంద్రం ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ విధానానికి శ్రీకారం చుడుతోంది. దీనిపై ఇప్పటికే ప్రతీ గ్రామంలో ప్రయోగాత్మకంగా అటెండెన్స్ నమోదు చేస్తున్నాం. అయితే సాంకేతికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాలన్నింటినీ ఉన్నతాధికారులకు నివేదించాం. కొత్త విధానం వచ్చే ఆర్థికసంవత్సరం నుంచి అమల్లోకి వచ్చే అవకాశముంది.

– రాథోడ్ రవీందర్, ఏపీడీ, ఆదిలాబాద్

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్చోడ: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి పరిష్కారవేదికలు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ రామకృష్ణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరిష్కారవేదికలో పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికే పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ మండలాల పరిధిలో 57 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. నాలుగింటిని అక్కడికక్కడే పరిష్కరించామని, మిగతా వాటిని పరిశీలించనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు కిషన్, రాజగౌడ్, డీఈ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఏఈ రాజు పాల్గొన్నారు.

కనెక్షన్ ఇవ్వకుండానే బిల్లులు..

ఇచ్చోడ మండలం ముఖరా(బీ)లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం 2021లో 52మంది రైతులు రూ.6,500 చొప్పున మొత్తం రూ.3.28లక్షలతో డీడీలు చెల్లించారు. ఇప్పటివరకు సంబంధిత రైతుల పొలాల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. కానీ, 2022–23 సంవత్సరంలో 10మంది రైతులకు విద్యుత్ బిల్లులు వచ్చాయి. విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకుండానే బిల్లులు రావడంతో రైతులు గురువారం ఇచ్చోడ విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహించిన పరిష్కారవేదికలో వినతిపత్రం అందజేశారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకుండానే బిల్లులు రావడంపై అక్కడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సర్పంచ్ అడమ్మారుతి, గ్రామస్తులున్నారు.



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ రామకృష్ణ

రాష్ట్ర సర్కార్ అలసత్వంతోనే పనులు జాప్యం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్
- రైల్వే గేట్ పరిసరాల పరిశీలన

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం కారణంగానే రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జి పనులు ఆలస్యమయ్యాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్ వద్ద రైల్వే గేట్ పరిసర ప్రాంతాలను గురువారం పరిశీలించారు. ఆ ప్రాంతంలో నిర్మించనున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనుల గురించి రైల్వే, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే వంతెనల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. 2018లోనే వంతెనలు పూర్తి కావాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోక పనులు నిలిచి నిర్మాణ వ్యయం పెరిగిందని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు నిధులు విడుదల చేయని కారణంగా తాంసి బస్టాండ్ వద్ద అండర్ బ్రిడ్జి పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. కాగా, తాటిగూడ, మహాలక్ష్మివాడ, భాగ్యనగర్ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలకు మూడు మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే 25శాతం ట్రాఫిక్ తగ్గుతుందని తెలిపారు. ఇప్పటికే రైల్వే క్రాసింగ్ వద్ద రైళ్లు వచ్చిన ప్రతీసారి దాదాపు అరగంట వరకు వేచి చూడాల్సిన దుస్థితి ఉందని పేర్కొన్నారు. పిట్‌లైన్ నిర్మాణం పూర్తయితే ప్రతీరోజు ఆదిలాబాద్ నుంచి 25 నుంచి 30 రైళ్ల రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. దీంతో సమస్య మరింత జటిలమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో సుమారు 50శాతం జనాభా రైల్వేలైన్ అవతల ఉన్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరుతానని చెప్పారు. రైల్వే ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.



పిట్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్, అధికారులు

క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- అధికారులతో సమీక్ష

కైలాస్‌నగర్: ప్రజాపాలన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దరఖాస్తుల క్షేత్ర పరిశీలన, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, పీఎం–జన్ మన్ పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేసి సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభించిన పీఎం–జన్ మన్ పథకం అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మండలాలు, గ్రామాల వారీగా పీవీటీజీ కుటుంబాలను గుర్తించి పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆధార్, ఓటరు, కుల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతీరోజు పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సామ్–మామ్‌పై నిరంతరం పర్యవేక్షించాలని సీడీపీవోలను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, ఆర్డీవో స్రవంతి, డీఆర్డీవో కిషన్, జెడ్పీ సీఈవో గణపతి, డీపీవో శ్రీనివాస్, మహిళాశిశు సంక్షేమశాఖ అధికారి మిల్కా, మున్సిపల్ కమిషనర్ శైలజ, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని మైనార్టీ గురుకులాలు, కళాశాలల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి (డీఎండబ్ల్యూవో) రమేశ్ రాథోడ్ తెలిపారు. గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఆరు గురుకులాలు, ఆరు కళాశాలల్లో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గురుకులంలో ఐదోతరగతిలో పూర్తి సీట్లు, 6, 7, 8 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలు, అలాగే కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్, సంబంధిత గురుకులాలు, కళాశాలలకు నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకులాల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గురుకులాలు, కళాశాలల ప్రిన్సిపాల్‌లు యూనుస్ సలీం, హిదాయతుల్లా హుస్సేన్, ఎండీ ఆసీఫ్, వెంకటప్రసాద్, వనిత, పల్లవి, తిరుపతి తదితరులున్నారు.

ఉచిత శిక్షణ కోసం..

గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నాలుగు నెలల పాటు కొనసాగే శిక్షణ తరగతులను ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 08732–221280 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు సూచించారు.



అడ్మిషన్ ప్రచారపత్రం ఆవిష్కరిస్తున్న అధికారులు

కేంద్ర పథకాలు వినియోగించుకోవాలి

- ఎంపీ సోయం బాపూరావు

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు సూచించారు. మండలంలోని రోల్‌మామడ గ్రామంలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. నవభారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించాలని ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అధికారుల ద్వారా అవగాహన కల్పించారు. బీమా ఆరోగ్య కార్యక్రమాలపై సంబంధిత అధికారులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు మోదీ సందేశాన్ని వీడియో రూపంలో ప్రజలకు వినిపించారు. దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, బీజేపీ నాయకులు గొర్ల రాజుయాదవ్, బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ సింగ్, పార్టీ మండల కన్వీనర్ సోనయ్య హీరాసింగ్, బీజేపీ నాయకులు తొడసం శంకర్, శేఖర్, ప్రశాంత్, ధర్మపురి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



రోల్‌మామడలో మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

పేదలకు స్థలాలివ్వాలి

ఎదులాపురం: జగిత్యాలలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలపై పోలీసులతో లాఠీచార్జి చేయించి, గుడిసెలు దహనం చేయించడమే కాకుండా పేదలు, సీపీఎం నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైలులో పెట్టడాన్ని సీపీఎం జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనం ఎదుట పార్టీ నాయకులు గురువారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 60చోట్ల ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఈ స్థలాలను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేయాలని చూస్తున్నారని, వారికి వత్తాసు పలుకుతూ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పోలీసుల ద్వారా గుడిసెలు తగలబెట్టిస్తూ, కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. మూడురోజుల క్రితం జగిత్యాల, కోరుట్ల పట్టణాల్లో గుడిసెవాసులపై దాడి చేసి, గుడిసెలకు నిప్పుపెట్టి, పేదలు, సీపీఎం నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గత ప్రభుత్వం ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంతోనే ఓటమి పాలైందన్న సంగతి రాష్ట్ర ప్రభుత్వం గమనించాలన్నారు. ఇప్పటికైనా అరెస్ట్ చేసిన వారిపై భేషరతుగా కేసులు ఎత్తివేయాలని, పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బండి దత్తాత్రి, జగన్ సింగ్, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, సురేందర్, మంజుల, స్వామి, లింగాల చిన్నన్న తదితరులున్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

నిర్మల్ చేరిన అయోధ్య లడ్డూ

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ భక్తుడు ఎస్.నాగభూషణంరెడ్డి 1,265 కిలోల లడ్డూను అయోధ్యకు తీసుకెళ్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో శ్రీరామ భక్తులు గురువారం ఘన స్వాగతం పలికారు. అయోధ్య రామ మందిరం నిర్మాణం మొదలుపెట్టిన రోజు నుండి ఒక్కో కిలో చొప్పున శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన వరకు 1,265 కిలోల లడ్డును తయారుచేసి అయోధ్యకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి విజేత ఆదిలాబాద్ జట్టు


విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్‌-14 విభాగంలో ఆదిలాబాద్ జిల్లా జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్ షిప్‌ కైవసం చేసుకుంది. సెమీఫైనల్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. గురువారం మెదక్ జట్టుతో జరిగిన హోరాహోరీ పోరులో 3-1 తేడాతో విజేతగా నిలిచినట్లు జట్టు మేనేజర్ స్వామి తెలిపారు. జిల్లా జట్టు విజేతగా నిలవడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, పెటా అధ్యక్షుడు పార్థసారథి, తదితరులు అభినందించారు.

'అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి'

పాతమంచిర్యాల: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్, జై భీం సైనిక్‌దళ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆసాది పురుషోత్తం డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి గంటల వ్యవధిలోనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పునరాలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలిటెక్ శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మార్త కుమారస్వామి, జిల్లా కార్యదర్శి గోక శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి నక్క శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లిలో వేములపల్లి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పత్తి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఇంట్లో సుమారు 50 క్వింటాళ్ల పత్తిని నిల్వ ఉంచగా గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పత్తికి నిప్పంటుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలు ఆర్పివేశారు. ఘటనలో సుమారు 15 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పత్తి విలువ సుమారు రూ.1.50 లక్షల వరకు ఉంటుందన్నాడు. ఆదుకోవాలని కోరుతున్నాడు.

హోరాహోరీగా ఐఎస్ఎల్

- వివిధ పోటీల్లో క్రీడాకారుల సత్తా
- బహుమతులు ప్రదానం చేసిన అతిథులు


మెడల్స్ అందజేస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం రెండోరోజు హాకీ, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హైజంప్, లాంగ్‌జంప్, పరుగు పందెం, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించారు. 100 మీటర్ల పరుగుపందెం (అండర్-14) విభాగంలో జాతర్ల ఆశ్రమ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్, ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ విక్రం గోల్డ్‌మెడల్ సాధించారు. 600 మీటర్ల విభాగంలో ఉట్నూర్ స్పోర్ట్స్ విద్యార్థి కొడప పరుశురాం గోల్డ్ మెడల్, హుజూర్‌నగర్‌కు చెందిన ప్రవీణ సిల్వర్‌మెడల్, షాట్‌పుట్ విభాగంలో బాయ్స్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి చరణ గోల్డ్ మెడల్, ఉట్నూర్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి మర్సుకోల ఇందూర్ షావ్ సిల్వర్ మెడల్ సాధించారు. 100 మీటర్ల పరుగుపందెం (అండర్-17) విభాగంలో కొలికొండ పాఠశాలకు చెందిన శివప్రసాద్ గోల్డ్ మెడల్, చిలుకూర్ పాఠశాలకు చెందిన రాజేశ్ సిల్వర్ మెడల్, 800 మీటర్ల విభాగంలో ముత్కల్ విద్యార్థి బసంత్ గోల్డ్ మెడల్, జేపీనగర్ విద్యార్థి సంతోశ్ సిల్వర్ మెడల్ సాధించారు. హైజంప్ అండర్-14 విభాగంలో జాతర్ల పాఠశాలకు చెందిన మడావి సోము గోల్డ్ మెడల్, చిట్యాల్‌కు చెందిన మురళీ కృష్ణ సిల్వర్ మెడల్, డిస్కస్‌త్రోలో నల్గొండకు చెందిన పవన్‌కుమార్ గోల్డ్ మెడల్, ఉప్పల్‌వాయికి చెందిన గౌతమ్ సిల్వర్‌మెడల్, హైజంప్ అండర్-17 విభాగంలో ఉట్నూర్ స్పోర్ట్ స్కూల్ విద్యార్థి జాదవ్ శ్రీకాంత్ గోల్డ్ మెడల్, హరిప్రసాద్ సిల్వర్ మెడల్, లాంగ్‌జంప్ విభాగంలో భద్రాచలంకు చెందిన వెంకటేశ్వర్‌రావు గోల్డ్ మెడల్, ఎస్‌కూర్ పాఠశాల విద్యార్థి చరణ్‌కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు. విజేతలకు డీడీ దిలీప్‌కుమార్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా క్రీడల అధికారి పార్థసారథి పోటీలను పర్యవేక్షిస్తున్నారు.


హాకీ ఆడుతున్న క్రీడాకారులు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

22న దీపావళి జరుపుకోవాలి

- ఎంపీ సోయం బాపూరావు


కార్యక్రమానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: అయోధ్య శ్రీరామ మందిర బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో ఈనెల 22న జిల్లా ప్రజలు దీపావళి జరుపుకోవాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో గురువారం నిర్వహించిన శ్రీకృష్ణానంద స్వామి ప్రవచనాల కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ శ్రీరామ మందిర ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందువుల 500 ఏళ్ల కల అయిన అయోధ్య రామ మందిర నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సాకారం అయ్యిందన్నారు. అయోధ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని యావత్ భారత దేశం కన్నుల పండువలా జరుపుకోనుందన్నారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పూర్క బాపూరావు


మాట్లాడుతున్న పూర్క బాపూరావు

నార్నూర్: ఆదివాసీలు హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పూర్క బాపూరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కొమురంభీం భవన్‌లో తుడుందెబ్బ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది తెగల ఆదివాసీల హక్కుల సాధనే తుడుందెబ్బ లక్ష్యమన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మడావి మాన్కు, అధ్యక్షుడిగా అడ శ్రీరామ్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా మడావి సాగర్, ఉపాధ్యక్షులుగా ఆత్రం పరమేశ్వర్, మెస్రం ప్రభాకర్, కుర్సెంగ రాందాస్, మెస్రం హీరాలాల్, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ విఠల్, కోశాధికారిగా జుగ్నాక్ భీంరావు, కార్యదర్శులుగా సెడ్మకి భీంరావు, మడావి జైవంత్‌రావు, సహాయ కార్యదర్శులుగా మెస్రం చిత్రు, కుంరం నాందేవ్, ప్రచార కార్యదర్శులుగా మెస్రం మోతీరాం, మెస్రం లక్ష్మణ్, సలహాదారులుగా కనక గోపాల్, ఆత్రం భీంరావు, గోవింద్, చిక్రం రమేశ్, మెస్రం రూప్‌దేవ్ పటేల్, సిడాం మల్కుపటేల్, తుంరం మాల్‌పటేల్, కుంరం మాన్కులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ సీనియర్ నాయకులు మడావి మానిక్‌రావు, తొడసం నాగోరావు, ఉర్వేత రూప్‌దేవ్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దాదిరావు, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ప్రవీణ్‌రెడ్డి


కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న ప్రవీణ్ రెడ్డి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి గురువారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతి ఆదిత్య సింధియాను కలిశారు. హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌కు కేంద్ర మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లోక ప్రవీణ్ రెడ్డి కేంద్ర మంత్రిని కలిసి జిల్లాలోని రాజకీయ పరిస్థితులను గురించి కొద్దిసేపు చర్చించారు. అనంతరం ఆయనను సన్మానించారు. అనంతరం బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఇక్బాల్, రాష్ట్ర అధికార ప్రతినిధి రచనా రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి జైలు

నిర్మల్‌టౌన్: బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి నిర్మల్ న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు సమన్వయ అధికారి సక్రి యనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గావత్వాడికి చెందిన కలే కొండిభా భైంసా రూరల్ మండలంలోని బడగాం గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నాడు. తానూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి అదేగ్రామంలోని ఓ వ్యక్తి వద్ద వ్యవసాయ కూలీగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. అతని కుమార్తె (12) 2018, ఏప్రిల్ 17న బంధువులతో కలిసి జౌల(కే) వెళ్ళింది. మరుసటిరోజు మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. ఆ సమయంలో తల్లిదండ్రులు ఇంటివద్ద లేకపోవడంతో ఆడుకుంటుండగా గమనించిన కొండిబా బాలిక వద్దకు వచ్చి పక్కనే మరో రేకుల షెడ్డులోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులతో బాలిక ఏడుస్తూ విషయం చెప్పడంతో భైంసా రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్సై ప్రభాకర్ కేసు నమోదు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు, స్పెషల్ పీపీ విశ్వాస్ రెడ్డి 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజుకు కావడంతో నిందితునికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కర్ణ కుమార్ గురువారం తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


అంబరావు (ఫైల్)

నేరడిగొండ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాదవ్ అంబరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మాజీ ఎంపీ గొడం నగేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం మండలంలోని రాజురలో నిర్వహించిన అంత్యక్రియల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఆయన వెంట తాంసి జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, మాజీ జెడ్పీటీసీ కృష్ణకుమార్, నేరడిగొండ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ నాయకులు సాబ్లే నానక్‌సింగ్, సాబ్లే ప్రతాప్ సింగ్, గులాబ్ సింగ్, అంబేకర్ పండరి, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు ...

కుభీర్: మండలంలోని బాకోట గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం తానూరు మండలం మసల్గాకు చెందిన నీలేవార్ శివాజీ (32) బుధవారం తన అత్తగారి ఊరైన బాకోటకు వచ్చాడు. గురువారం తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు బీటీ రోడ్డు పైకి రావడంతో భైంసా నుంచి కుభీర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య రంజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు ...

కౌటాల: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలంలోని గుండాయిపేట్‌కు చెందిన ఎల్ములే దిలీప్ (32) గురువారం ఉదయం బైక్‌పై పంటచేనుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుండాయిపేట గ్రామ సమీపంలో అడవిపంది అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఘటనలో దిలీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


గణేశ్ (ఫైల్)

లోకేశ్వరం: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోట్‌పల్లికి చెందిన బోరిగామా గణేశ్ (23) చిన్నతనం నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతున్నాడు. ఈక్రమంలో గురువారం గ్రామ సమీపంలోని తన చేనులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో యువకుడు..


ఎస్.కె.దాద్ (ఫైల్)

తాంసి: మనస్తాపంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో పొన్నారిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎస్.కె.దాద్ (30) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో పాటు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై శివరాం మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు...

లక్సెట్టిపేట: మండలంలోని దౌడపల్లి గ్రామానికి చెందిన గాగిరెడ్డి లక్ష్మారెడ్డి (64) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మారెడ్డికి భార్య నర్సమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు కెనడాలో, కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. దంపతులిద్దరూ ఇంటివద్దే ఉంటున్నారు. కుమారుడు సంక్రాంతికి ఇంటికి వచ్చి మళ్లీ హైదరాబాద్‌కు వెళ్తుండగా ఇద్దరమే ఉంటున్నామని బాధపడుతూ సాగనంపాడు. వృద్ధాప్యంలో ఎవరూ అందుబాటులో ఉండరని మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. భార్య నర్సమ్మ వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని కుమారుడు కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్‌టౌన్: పిచ్చికుక్కల దాడిలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఎం.ప్రభాకర్‌పై పిచ్చి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రోజురోజుకూ పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పిచ్చి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని కోరుతున్నారు.

కేకే5 గనిపై కేబుల్ చోరీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై గల ఎలక్ట్రికల్ మెటీరియల్ స్టోర్ నుంచి బుధవారం రెండోషిఫ్టులో విలువైన కేబుల్ చోరీకి గురైనట్లు (ఎస్అండ్‌పీసీ) జూనియర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారి తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి సుమారు 9.15 గంటలకు కొంతమంది దొంగలు ఒక్కసారిగా స్టోర్‌లోకి చొరబడ్డారు. విధి నిర్వహణలో ఉన్న గార్డుపై రాళ్లు రువ్వుతూ కర్రలతో బెదిరించారు. 70 మీటర్ల ప్లగ్‌తో ఉన్న ట్రెయిలింగ్ కేబుల్‌ను తీసుకెళ్లారు. కేబుల్ విలువ రూ.లక్షల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులు బయటి నుంచి వచ్చారా? లేక స్థానికులేనా? అనే విషయం తేల్సాల్సి ఉంది. ఏదిఏమైనా సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో పాటు పోలీస్ సిబ్బంది గనులపై పెట్రోలింగ్ ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

'ఈపీఎఫ్ డబ్బులు ఖాతాలో జమ చేయాలి'

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఈపీఎఫ్ డబ్బులు తమ పీఎఫ్ ఖాతాలలో జమ చేయాలని నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గురువారం విలేజ్ నస్పూర్ టర్నింగ్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల నుండి మూడేళ్లుగా నెలకు రూ.1,900 చొప్పున ఈపీఎఫ్ డబ్బులు కట్ చేస్తున్నారని, వాటిని కార్మికుల పీఎఫ్ ఖాతాలలో జమ చేయడం లేదన్నారు. దీక్షలను యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాసరి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు మద్దెర్ల సతీష్, కోశాధికారి మాద్గుల రాజం, నాయకులు గేరె లింగయ్య, అడ్లకొండ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు

- పాలిటెక్నిక్‌లో చేరేందుకు అవకాశం
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఈ నెల 31 తుది గడువు


మంచిర్యాల ఐటీఐ భవనం

మంచిర్యాలఅర్బన్: ఉజ్వల భవితకు పాలిటెక్నిక్ వారధిగా నిలుస్తోంది. కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశం లభిస్తోంది. ఇంత ప్రాధాన్యం ఉన్న పాలిటెక్నిక్ కోర్సులో నేరుగా చేరేందుకు ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ కోర్సులో చేరేందుకు బ్రిడ్జి కోర్సులను అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ నెల 31వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది.

దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

పాలిటెక్నిక్‌లో చేరేందుకు ఐటీఐ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు ప్రవేశపెట్టారు. జిల్లాలో 12 ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్, జన్నారంలో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా ఎనిమిది ప్రైవేట్ కళాశాలలున్నాయి. మంచిర్యాల ఐటీఐలో బ్రిడ్జి కోర్సు ప్రవేశానికి దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుంది. పదో తరగతి మెమో, ఐటీఐ ఉత్తీర్ణత సర్టిఫికెట్, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 31లోపు దరఖాస్తులు సమర్పించవచ్చు. థియరీ, ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నారు. తర్వాత ఎల్పీ సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా 2024-25 విద్యా సంవత్సరానికి గాను పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు కల్పించనున్నారు.

31తుది గడువు

ఐటీఐ రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న వారంతా పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నిర్వహిస్తున్న బ్రిడ్జి కోర్సు సద్వినియోగం చేసుకోవాలి. బ్రిడ్జి కోర్సులో ప్రవేశాలకు జిల్లాలో 40 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 31 వరకు తుది గడువు ఉందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 31లోపు దరఖాస్తులు చేసుకోవాలి.

– చందర్, ఐటీఐ ప్రిన్సిపాల్, మంచిర్యాల

హైవేపై బోర్‌వెల్ లారీ బోల్తా


బోర్‌వెల్ లారీ కింద ఇరుక్కున్న కూలీ


క్రేన్ సహాయంతో కూలీని బయటకు తీస్తున్న స్థానికులు

- వెనుకనుంచి ఢీకొట్టిన ఐచర్
- కూలీ, ఐచర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- క్రేన్ సాయంతో ఇరువురిని బయటకు తీసిన పోలీసులు

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై సీతాగోంది వద్ద బోర్‌వెల్ లారీని ఐచర్ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న బోర్‌వెల్ లారీని వెనుక నుంచి వేగంగా వస్తున్న ఐచర్ లారీ ఢీ కొట్టింది. దీంతో బోర్‌వెల్ లారీ రోడ్డు పైనే బోల్తా కొట్టింది. ఆ సమయంలో బోర్‌వెల్ లారీ క్యాబిన్‌లో నలుగురు యంత్రంపై వెనుక ఒకరు ప్రయాణిస్తున్నారు. క్యాబిన్‌లో ఉన్న వారికి ఏమీ కాకపోగా వెనుక కూర్చున్న కూలీ లారీ కింద ఇరుక్కుపోయాడు. అదే క్రమంలో ఐచర్ క్యాబిన్ నుజ్జునుజ్జు కాగా క్యాబిన్‌లో డ్రైవర్ చిక్కుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రం నుంచి రెండు క్రేన్‌లు తీసుకు వచ్చి ఇద్దరినీ బయటకు తీసి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో హైవేపై ఇరువైపులా మూడు కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సై ఇమ్రాన్ సహాయకచర్యల్లో పాల్గొన్నారు.

పక్షుల బెడద లేకుండా.. పంటను కాపాడుకునేలా..

తలమడుగు మండలం పల్సిబి తండాలో రాథోడ్ ఘన్ శ్యాం తన జొన్నపంటను కాపాడుకునేందుకు చేసిన ఆలోచన అదిరింది. అటవీ ప్రాంతంలో గల చేనులో పక్షుల బెడద అధికంగా ఉండటంతో పంట చేను చుట్టూ ఇలా చేపల వలను ఏర్పాటు చేశాడు. చేను మధ్యలో మంచె ఏర్పాటు చేసుకుని రాత్రి వేళ అక్కడే ఉంటూ శబ్దాలు చేస్తూ పక్షులు రాకుండా జాగ్రత్త పడుతున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్




పంట చుట్టూ ఏర్పాటు చేసిన చేపల వల